24న మెగా జాబ్ మేళా

అబిడ్స్, జనవరి 18 : ఆర్.ఆర్. చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో ఈ నెల 24న తెలంగాణ మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు డెక్కన్ బ్లాస్టర్ చైర్మన్ మన్నన్‌ఖాన్ ఇంజనీర్ గురువారం తెలిపారు. 24వ తేదీన ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మేళా ఉంటుందన్నారు. గ్రాడ్యుయేట్లకు ఉద్యోగాలు ఇచ్చేందుకు పలు కార్పొరేట్ కంపెనీలు ముందుకు వస్తున్నాయని, ప్రతిభ కనబరిచిన వారికి స్పాట్ ఆఫర్ లెటర్స్ అందించనున్నారన్నారు. మా సాబ్‌ట్యాంక్‌లోని ఖాజా మెన్షన్ హాల్‌లో నిర్వహించే ఈ మేళా ఇతర వివరాల కోసం 8374315052 లో సంప్రదించాలని కోరారు.

20న విశ్వబ్రాహ్మణ కార్యవర్గ సమావేశం

రవీంద్రభారతి, జనవరి 18 : ఈ నెల 20న ఉదయం 10 గంటలకు హైదరాబాద్‌లోని నారాయణగూడ బొజ్జ జయసేన మెమోరియల్‌హాల్‌లో ప్రతిష్టాత్మకమైన విశ్వ బ్రాహ్మణ, విశ్వకర్మల మాతృసంఘం కార్యకవర్గ సమావేశం నిర్వహిస్తున్నామని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల మధన్‌మోహన్, గౌరవాధ్యక్షుడు లాలుకోట వెంకటాచారి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చొల్లెటి కృష్ణమాచార్యులు తెలిపారు. గురువారం పత్రికా ప్రకటన విడుదల చేస్తూ 2024 సంవత్సరానికి గాను పంచ బ్రహ్మశిల్ప కళా పురస్కారాలను సంఘం నాయకులు అందజేస్తారని తెలిపారు.

కులగణనపై 20 నుంచి సెమినార్

రవీంద్రభారతి, జనవరి 18 : ఆల్ ఇండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ' కులగణన, సామాజిక న్యాయం ' అంశంపై ఈ నెల 20, 21 తేదీలలోయూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో నేషనల్ సెమినార్ నిర్వహించనున్నామని నిర్వాహకులు ఎ.ఐ.ఒ.బి.సి.ఎస్.ఎ. జాతీయ అధ్యక్షుడు జి. కిరణ్‌కుమార్ తెలిపారు. వర్చువల్ మోడల్‌లో కూడా జరుగుతున్న సమినార్‌లో ప్రముఖ విధాన రూపకకర్త శ్యాంపిట్రోడ, ద్రావిడ కళగం కార్యదర్శి కే వీరమణి, డి.ఎం.కె. రాజ్యసభ సభ్యుడు పి.విల్సన్, స్వరాజ అభియాన్ అధ్యక్షుడు యోగేంద్రయాదవ్, ప్రొఫెసర్ ఈ. వెంకటేశం, ఆళ్ల రామకృష్ణ పాల్గొంటారని కిరణ్‌కుమార్ తెలిపారు.

నియోజకవర్గ సమగ్రాభివృద్ధే ధ్యేయం

■ ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

బాయమ్మగల్లీలో డ్రైనేజీ పైపులైన్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

అంబర్‌పేట/ కాచిగూడ,జనవరి 18 : అంబర్‌పేట నియోజకవర్గ సమగ్రాభివృద్ధే ధ్యేయమని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. కాచిగూడలోని బండాల్ బస్తీ, నింబోలిఅడ్డా ప్రాంతాల్లో పాదయాత్ర నిర్వహించి, అనంతరం బస్తీ, కాలనీ వాసుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పలు బస్తీ, కాలనీల్లో సీసీ కెమెరాలు, కుక్కల బెడదను పరిష్కరించాలని స్థానికులు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేయగా స్పందించిన ఎమ్మెల్యే సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అన్ని నియోజకవర్గాల కంటే కాచిగూడను ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తిర్చిదిద్దుతానని, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని నియోజకవర్గంలో డ్రైనేజీ, తాగునీటి వ్యవస్థను త్వరిగతిన ఆధునీకరిస్తామన్నారు. ఐదు డివిజన్ల సమగ్రాభివృద్ధికి యుద్ధ ప్రాతిపాదికన సత్వర చర్యలు చేపడుతూ, నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తూ, మౌలిక సదుపాయలు కల్పించేందుకు బాధ్యతగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేస్తున్నట్లు, మౌలిక వసతుల కల్పనలో రాజీపడే ప్రసక్తే లేదన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఉమా రమేశ్‌యాదవ్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు ఎర్ర బీష్మాదేవ్, కన్నె రమేశ్‌యాదవ్, ఓం ప్రకాశ్‌యాదవ్, ధాత్రిక్ నాగేందర్ బాబ్జి, బి.కృష్ణాగౌడ్, సత్యేందర్, మహేశ్‌కుమార్, సరిత, సత్యనారాయణ, మహేందర్ పాల్గొన్నారు.

నల్లకుంటలో ఎమ్మెల్యే పాదయాత్ర ..

నల్లకుంట డివిజన్‌లోని బాయమ్మగల్లీ, బ్రాహ్మణ హాస్టల్ ప్రాంతాల్లో డ్రైనేజీ పైపులైన్ పనులను ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ గురువారం పరిశీలించారు. రూ.60 లక్షలతో చేపట్టిన ఈ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకొని పలు సూచనలు చేశారు. ఎమ్మెల్యే తన దృష్టికి వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వాటర్‌వర్క్స్ మేనేజర్ రోహిత్, జీహెచ్ఎంసీ డీఈ ప్రవీణ్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను పూర్తి చేయండి

టోలిచౌకిలో జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్‌తో కలిసి పర్యటిస్తున్న కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహినుద్దీన్

మెహిదీపట్నం, జనవరి 18 : మౌలిక సదుపాయాల కల్పనకు అభివృద్ధి పనులను పూర్తి చేయాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహినుద్దీన్ అధికారులకు సూచించారు. గురువారం గోల్కొండ, లంగర్‌హౌస్, నానల్‌నగర్, టోలిచౌకి, కార్వాన్ డివిజన్లలో జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్, జడ్సీ వెంకటేశ్ దోత్రె, డీసీ శశిరేఖలతో కలిసి ఎమ్మెల్యే పెండింగ్ పనులను పరిశీలించారు. ముఖ్యంగా నాలాల అభివృద్ధి పనులను తొందరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. వర్షాల కారణంగా కలిగే ఇబ్బందులను దూరం చేయడానికి చేపట్టిన పనులు ఆగిపోయాయని సంబంధిత కాంట్రాక్టర్లతో చర్చించి పనులను ప్రారంభించాల న్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఎండీ.నసీరుద్దీన్, స్వామియాదవ్ పాల్గొన్నారు.

కల్లుగీత కార్మికులకు చేయూత అందించాలి

ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను సన్మానిస్తున్న బాలగౌని బాల్‌రాజ్‌గౌడ్

చిక్కడపల్లి, జనవరి 18 : కల్లుగీత కార్మికులకు చేయూత అందించాలని గౌడ, కల్లుగీత వృత్తిదారుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ కల్లు గీత సంఘాల సమన్వయ కమిటీ సభ్యులు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను కోరారు. గురువారం కమిటీ చైర్మన్ బాలగౌని బాల్‌రాజ్‌గౌడ్, యెలికట్టె విజయ్‌కుమార్ గౌడ్, గౌడ జనహక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు బాలగౌని వెంకటేశ్ ఉప ముఖ్యమంత్రిని కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రమాదంలో మరణించిన, అంగవైకల్యం చెందిన కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా పెండింగ్‌లో ఉందని తెలిపారు. హామీలను అమలు చేయాలని ఉప ముఖ్యమంత్రిని కోరగా.. సానుకూలంగా స్పందించారన్నారు.

సమస్యలు పరిష్కరించడంపై హర్షం

అనిల్‌కుమార్

ముషీరాబాద్, జనవరి 18 : రాం నగర్ చేపల మార్కెట్ ప్రధాన రోడ్డులో ఎదురవుతున్న డ్రైనేజీ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నందుకు రాంనగర్ వర్తక సంఘం ప్రతినిధులు ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్‌కు కృతజ్ఞతలు తెలిపారు. వ్యాపారులకు ఇబ్బందిగా మారిన సమస్యను పరిష్కరించాలని కోరిన వెంటనే ఎమ్మెల్యే స్పందించి మురుగు నీటి లీకేజీ సమస్యను పరిష్కరించినందుకు సంఘం ప్రతినిధులు నాల్లా అనిల్‌కుమార్, వేపూర్ రాజ్‌కుమార్, బచ్చు రాజ్‌కుమార్, భూమ్‌పల్లి రవి చారి ఒక ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు.

గురుగోవింద్ సింగ్ జయంతి

సుల్తాన్‌బజార్,జనవరి 18 : గురుగోవింద్ సింగ్ జయంతి, పదో సిక్కు గురువు 357వ జయంతి సందర్భంగా బజరంగ్ సేవా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.ఆర్. లక్ష్మణ్‌రావు సెంట్రల్ గురుద్వారా సాహిబ్ గౌలిగూడను సందర్శించి సిక్కుల పవిత్ర గ్రంథమైన గురు గ్రంథ్ సాహిబ్‌కు వారు నివాళులర్పించారు. బజరంగ్ సేన నాయకులు మనోజ్ బజరంగ్ సేన నగర అధ్యక్షుడు అరుణ్‌సింగ్, ఆశిష్, నరేశ్, విజయ్, నిలేశ్ పాల్గొన్నారు.

సుస్వర సినీ సంగీత విభావరి

నటుడు మురళీమోహన్‌ను సన్మానిస్తున్న దామోదర్‌గుప్త, సాలూరి రాజేశ్వరరావు

రవీంద్రభారతి, జనవరి 18 : శ్రీవాసవి ఆర్ట్స్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో ప్రముఖ గాయకుడు కేజే ఏసుదాసు 84వ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని గురువారం నిండు చందమామ సుస్వర సినీ సంగీత విభావరిని రవీంద్రభారతిలో నిర్వహించారు. పోలీస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్ గుప్త సభాఅధ్యక్షత వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ నటుడు మురళీ మోహన్ విచ్చేశారు. ఈ సందర్భంగా మురళీమోహన్‌ను కోలేటి దామోదర్ గుప్త, సాలూరి రాజేశ్వరరావు జ్ఞాపికతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో వాసవి ఆర్ట్స్ వ్యవస్థాపకుడు ముక్కంటేశ్వరరావు, సంఖ్యాశాస్త్ర నిపుణులు దైవజ్ఞశర్మ, విజయ్‌కుమార్, సంగీత దర్శకుడు సాలూరి రాజేశ్వరరావు పాల్గొన్నారు. సభకు ముందు గాయకులు ఏసుదాసు సినీగీతాలను ఆలపించారు.

మల్లన్న జాతర విజయవంతం..

ఆలయ మేనేజింగ్ ట్రస్టీ నల్లవెల్లి అంజిరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

కవాడిగూడ, జనవరి 18: అందరి సహకారంతో శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి జాతర విజయవంతంగా ముగిసిందని ఆలయ కమిటీ మేనేజింగ్ ట్రస్టీ నల్లవెల్లి అంజిరెడ్డి, ఆలయ మాజీ చైర్మన్ నల్లవెల్లి ఊర్మిళ తెలిపారు. గురువారం బాకారంలో ట్రస్టీ అంజిరెడ్డిని బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు శాలువాతో సన్మానించారు. నాయకులు తుమ్మరాజు, గోక నవీన్, ముదిగొండ మురళి, అరుణ్, బాలకృష్ణ పాల్గొన్నారు.

ఫుడ్ కార్పొరేషన్.. బోర్డు సభ్యురాలిగా వరలక్ష్మి

కాచిగూడ, జనవరి 18 : కేంద్ర ప్రభుత్వ అమోదిత మినిస్ట్రీ ఆఫ్ కంజూమర్ ఎఫైర్స్, ఫుడ్ అండ్ పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ తెలంగాణ ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా బోర్డు సభ్యురాలిగా ఎన్.వరలక్ష్మిని నియమిస్తూ గురువారం కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ సందర్భంగా కాచిగూడలో ఆమె మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా వివిధ రంగాల్లో అందించిన విశిష్ట సేవలను గుర్తించి కేంద్ర ప్రభుత్వం ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా బోర్డు సభ్యురాలిగా నియమించిందని వెల్లడించారు.

వాల్ రైటింగ్ క్యాంపెయిన్ ప్రారంభం

అబిడ్స్, జనవరి 18 : జాతీయ బీజేపీ వాల్ రైటింగ్ క్యాంపెయిన్‌లో భాగంగా జాతీయ అధ్యక్షులు జేపీ నడ్డా పిలుపు మేరకు జాంబాగ్ కార్పొరేటర్ రాకేశ్ జైస్వాల్ డివిజన్‌లో వాల్ పెయింటింగ్ ప్రారంభించారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు శ్రీనివాస్ యాదవ్, అమర్‌సింగ్, మయూర్ కలేకర్, రఘు కాంబ్లే, అనిల్ యాదవ్, రామకృష్ణ, ముఖేశ్, సందీప్, సురేశ్, క్రాంతి, శ్రీకాంత్, పవన్, అరుణ్ పాల్గొన్నారు.

■ గోల్కొండలోని ఏరియా దవాఖాన తనిఖీ..

కార్వాన్ నియోజకవర్గం గోల్కొండలోని ఏరియా దవాఖానలో గురువారం తెలంగాణ వైద్యవిధాన పరిషత్ హైదరాబాద్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సునీత ఆకస్మికంగా పర్యటించారు. దవాఖానలో జరుగుతున్న అభివృద్ధి, పరిశుభ్రత పనులను సమీక్షించారు. దవాఖానలో సౌకర్యాలు కల్పించడానికి చేపట్టాల్సిన పనులపై సూపరింటెండెంట్ డాక్టర్ మహ్మజ్ మజహరుల్లాతో చర్చించారు.

– మెహిదీపట్నం, జనవరి 18

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతి పత్రం ఇస్తున్న ఎ.రాజేశ్వర్‌యాదవ్

రవీంద్రభారతి, జనవరి 18 : బీసీ విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు ఎ.రాజేశ్వర్‌యాదవ్ బృందం గురువారం వినతి పత్రం సమర్పించింది. బ్యాంకింగ్ కోర్సులకు ఉచిత కోచింగ్ అందించాలని మంత్రి ని కోరారు. సత్యనారాయణ, విజయ్‌కుమార్, రవి, సాయివర్ధన్ పాల్గొన్నారు.

రామమందిరానికి 108 కిలోల హారతి కర్పూరం

శ్రీరామ సేవాదళ్ తరపున అయోధ్య శ్రీరాముల ప్రాణప్రతిష్ఠ సందర్భంగా ప్రథమ మంగళ హారతికై 108 కిలోల స్వచ్ఛమైన హారతి కర్పూరం అంబర్‌పేట మహంకాళి టెంపుల్ నుంచి రామరథంపై గురువారం బయలుదేరింది. విజశ్రీ చాంపోర్ ఇండస్ట్రీస్ ద్వారా పడాల నయనాకర్, పోతంశెట్టి అనూప్‌కుమార్, శ్రీనివాస్ ఏదుల, కృష్ణ ఏదుల, రవికిరణ్ ఏదుల, వెంకటేశ్వర్లు దేవరుప్పల, పంజాల శేఖర్‌గౌడ్ ఈ హారతి కర్పూరాన్ని అయోధ్యకు పంపించారు.

– అంబర్‌పేట, జనవరి 18

22న ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేయాలి

బొగ్గులకుంటలో దేవాదాయ శాఖ కమిషనర్‌ను కలిసి వినతి పత్రం అందజేస్తున్న విశ్వ హిందూ పరిషత్, బజరంగ్‌దళ్ నాయకులు

సుల్తాన్‌బజార్,జనవరి 18 : అయోధ్యలోని శ్రీ రామజన్మభూమి మందిర ప్రారంభం సంdర్భంగా తెలంగాణ రాష్ట్రంలోని అన్ని దేవాలయాలల్లో 22న అన్ని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేయాలని విశ్వ హిందూ పరిషత్, బజరంగ్‌దళ్ డిమాండ్ చేశాయి. గురువారం బొగ్గులకుంటలోని దేవాదాయ, ధర్మాదాయ శాఖ ప్రధాన కార్యాలయంలో శాఖ కమిషనర్ అనిల్‌కుమార్‌ను వీహెచ్‌పీ రాష్ట్ర కార్యదర్శి పండరీ నాథ్,ఉపాధ్యక్షులు జగదీశ్వర్,ప్రచార ప్రముఖ్ పగుడాకుల బాలస్వామి, బజరంగ్‌దళ్ రాష్ట్ర కన్వీనర్ శివరాములు, రాష్ట్ర కో – కన్వీనర్ జీవన్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ విషయమై కమిషనర్ సానుకూలంగా స్పందిస్తూ రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి దృష్టికి తీసుకువెళ్లి నిర్ణయం తీసుకుంటామ న్నారు.

పైపులైన్‌కు మరమ్మతులు

అంబర్‌పేట, జనవరి 18 : బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లోని సాయిమధురానగర్ కోదండరామ నిలయం దగ్గర 15 రోజుల నుంచి తాగునీరు రావడం లేదని స్థానికులు కార్పొరేటర్ బి.పద్మవెంకటరెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన కార్పొరేటర్ గురువారం వాటర్‌వర్క్స్ సిబ్బందిని పిలిపించి పరిశీలించారు. పైపులైన్ పగిలిపోవడంతో వెంటనే మరమ్మతులు చేపట్టి అంతరాయం లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

హుండీ లెక్కింపు

చిక్కడపల్లి, జనవరి18 : చిక్కడపల్లిలోని వివేక్‌నగర్ శ్రీ హనుమాన్ ఆలయంలో హుండీ లెక్కింపు జరిగింది. గురువారం దేవాలయం కార్యనిర్వహణాధికారి మాచర్ల దేవనాదం, ఇన్‌స్పెక్టర్ సురేఖ పర్యవేక్షణలో హుండీ లెక్కించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడు తూ.. నెల రోజులకు గాను రూ.1,12,315 ఆదాయం వచ్చిందని తెలిపారు. అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

స్వచ్ఛభారత్ కార్యక్రమం

కార్వాన్ నియోజకవర్గం గోల్కొండలోని ప్రభుత్వ ఏరియా దవాఖానలో గురువారం డాక్టర్లు, సిబ్బంది, ఎన్‌జీవోలతో కలిసి స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. నానల్‌నగర్ కార్పొరేటర్ ఎండీ.నసీరుద్దీన్, సూపరింటెండెంట్ డాక్టర్ మహ్మద్ మజహరుల్లా పాల్గొని దవాఖాన పరిసరాల్లో పరిశుభ్రత పనులను చేపట్టారు.

– మెహిదీపట్నం, జనవరి 18

వ్యక్తి ఆత్మహత్య..

కాచిగూడ, జనవరి 18 : ఓ వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. హెడ్‌కానిస్టేబుల్ చిమ్నానాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. సుల్తాన్‌షాహి, శాలిబండ ప్రాంతానికి చెందిన రుక్మోద్దిన్ కుమారుడు మహ్మద్ షరీఫ్ (35) మటన్ షాపులో పనిచేస్తాడు. ఆర్థిక పరిస్థితులు సరిగ్గాలేక ఇంటి అద్దె చెల్లించడం లేదు. దీంతో భార్య నజీమాబేగం బోధన్‌లోని పుట్టింటికి వెళ్లిపోయింది. గురువారం భార్య, బిడ్డకు మహ్మద్ షరీఫ్ వీడియో కాల్ చేస్తూ మనస్తాపంతో శివరాంపల్లి – ఫలక్‌నుమా రైల్వేస్టేషన్ల మధ్య రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. కేసు దర్యాప్తులో ఉన్నది.

ప్రగతి మహావిద్యాలయ డిగ్రీ కళాశాల గోల్డెన్ జూబ్లీ

గుజరాతి ప్రగతి సమాజ్ ప్రగతి మహావిద్యాలయ డిగ్రీ కళాశాల గోల్డెన్ జూబ్లీ ఉత్సవాన్ని ప్రారంభించిన సుల్తాన్‌బజార్ ఏసీపీ చిన్న బాలగంగిరెడ్డి

సుల్తాన్‌బజార్,జనవరి 18 : పేద విద్యార్థులను అత్యున్నతంగా తీర్చిదిద్దేందుకు శ్రీ గుజరాతి ప్రగతి సమాజ్ చేస్తున్న కృషి అభినందనీయమని సుల్తాన్‌బజార్ ఏసీపీ ఏ చిన్న బాల గంగిరెడ్డి పేర్కొన్నారు గురువారం హనుమాన్‌టేక్డీలోని ప్రగతి మహా విద్యాలయ డిగ్రీ కళాశాల 50 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా స్వర్ణోత్సవాన్ని నిర్వహించారు.

ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన ఉస్మానియా యూనివర్సిటీ కామర్స్ డిపార్ట్‌మెంట్ సీనియర్ ప్రొఫెసర్ వి.అప్పారావు, గోల్డెన్ జూబ్లీ కమిటీ చీఫ్ ప్యాట్రన్ మహేశ్ ఎస్ పటేల్‌లతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. వ్యసనాలకు బానిస కాకుండా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థులకు పిలు పునిచ్చారు. గోల్డెన్ జూబ్లీ కమిటీ చీఫ్ ప్యాట్రన్ మహేశ్ ఎస్ పటేల్ మాట్లాడుతూ.. 1973లో శ్రీ గుజరాతి ప్రగతి సమాజ్ ఆధ్వర్యంలో డిగ్రీ కళాశాల ప్రారంభమైనదన్నారు. ఈ కార్యక్ర మంలో గోల్డెన్ జూబ్లీ కమిటీ చైర్మన్ శ్రీ గుజరాతి ప్రగతి సమాజ్ అధ్యక్షుడు గోవింద్ దాస్ షా, కో చైర్మన్ గుజరాతి సమాజ్ సంయుక్త కార్యదర్శి, పీఎంవీ కరస్పాండెంట్ గోపాల్ ఓ పటేల్, సలహాదారులు శ్రీ గుజరాతి ప్రగతి సమాజ్ కార్యదర్శి రాహుల్ చెడా, సమాజ్ కోశాధికారి అంబాలాల్ పటేల్, పీఎంవీ జూని యర్ కళాశాల కరస్పా ండెంట్ జితేన్ మజేతియా, పీఎంవీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ భారతి బెన్ పటేల్, పీఎంవీ కన్వీ నర్‌లు పీజీ కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వైకేఎం నాయుడు,జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ మాధవీత, టీఈ రాజగోపాలన్, ప్రిన్సిపాల్ నిరూప సింగ్, కో – ఆర్డినేటర్ అమిత్ సింగ్, ఎన్‌సీసీ ఆఫీసర్ డాక్టర్ టీపీ సింగ్, పూర్వ విద్యార్థులు, నాన్ టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

కన్నుల పండువగా శ్రీ సీతారాముల కల్యాణం

దేవిబాగ్‌లో నిర్వహించిన సీతారాముల కల్యాణోత్సవంలో పాల్గొన్న మాధవీలత

చార్మినార్, జనవరి 18 : లతామా ఫౌండేషన్ ఫౌండర్ మాధవీలత ఆధ్వర్యంలో గురువారం బహదూర్‌పుర నియోజకవర్గంలోని దేవిబాగ్‌లో అయోధ్యలో రామ మందిర ప్రాణ ప్రతిష్ఠను పురస్కరించుకుని దుర్గాదేవి ఆలయంలో సీతారాముల వివాహ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. లతా మా ఫౌండేషన్ ఆధ్వర్యంలో 6 రోజుల పాటు నిర్వహించ తలపెట్టిన సీతారాముల కల్యాణ కార్యక్రమంలో రెండోరోజున దేవిబాగ్‌లో సీతారాముల కల్యాణం నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు, స్థానికులు, పలువురు ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాల దొంగలు రిమాండ్

● ఆరు వాహనాలు స్వాధీనం

గుట్ట పోలీసుల అదుపులో ద్విచక్ర వాహనాలు చోరీ చేసిన దొంగలు

చాంద్రాయణగుట్ట, జనవరి 18 : ద్విచక్ర వాహనాలు చోరీ చేస్తున్న ముగ్గురు నిందితులను చాంద్రాయణగుట్ట పోలీసులు అరెస్ట్ చేసి గురువారం రిమాండ్‌కు తరలించారు. వీరి నుంచి ఆరు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. చాంద్రాయణగుట్ట పీఎస్‌లో ఏసీపీ కె.మనోజ్ కుమార్ వివరాలను వెల్లడించారు. ఛత్రినాక, చాంద్రాయణగుట్ట ప్రాంతాల్లో నివసించే మహ్మద్ అజీజ్, మహ్మద్ షరీఫ్, మహ్మద్ జానీ పాషా ద్విచక్ర వాహనాలను చోరీ చేసి సొమ్ము చేసుకుంటున్నారు. షరీఫ్ ఇండ్ల ఎదుట పార్కింగ్ చేసిన వాహనాలపై రెక్కీ నిర్వహిస్తాడు. అజీజ్, పాషాతో కలిసి స్కెచ్ ప్రకారం చోరీ చేస్తారు. చోరీ సమయంలో ఇద్దరు మైనర్ల సహాయం తీసుకుంటారు. విశ్వసనీయ సమాచారం మేరకు డీఎస్సై హుస్సేన్ టీం నిందితులను పట్టుకొని ప్రశ్నించగా విషయం వెలుగులోకి వచ్చింది. నిందితుల నుంచి వాహనాలు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. వీరికి సహకరించిన మైనర్లను జువైనల్ హోంకు తరలించారు.

సమీక్షా సమావేశం

మెహిదీపట్నం, జనవరి 18 : ప్రజలకు తాగునీటి, సీవరేజీ సమస్యలు లేకుండా జలమండలి అధికారులు చర్యలు తీసుకోవాలని నాంపల్లి ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్ అన్నారు. గురువారం జలమండలి ఉన్నతాధికారులతో ఎమ్మెల్యే సమీక్షా సమావేశం నిర్వహించారు. జలమండలి అధికారులు,జీఎం, డీజీఎంలు పాల్గొన్నారు.

విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముషీరాబాద్, జనవరి 18 : ఆజామాబాద్ డివిజన్ రామాల యం, శివం టెంపుల్, డీడీ కాలనీ, ఇందిరా నగర్ ఫీడర్ల పరిధిలో విద్యుత్ లైన్‌ల మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏడీఈ ఒక ప్రకటనలో తెలిపారు.

ఉదయం 9 : 30 నుంచి 11 : 30గంటల వరకు

న్యూ నల్లకుంట, సిండికేట్ బ్యాంక్, నరేంద్ర పార్కు, రామాలయం పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తారు.

ఉదయం 11 : 30 నుంచి మధ్యాహ్నం 1 : 30 గంటల వరకు

టీఆర్‌టీ క్వార్టర్స్, శివం టెంపుల్, ప్రశాంత్‌నగర్, తరుణి సూపర్ మార్కెట్, నర్సింహ బస్తీ, విద్యానగర్ రైల్వే స్టేషన్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదు

మధ్యాహ్నం 2 : 30 నుంచి 4 : 30 గంటల వరకు

డీడీ కాలనీ ఏ అండ్ బీ లైన్, రామచంద్రయ్య డిగ్రీ కాలేజ్, గ్లాస్కో, హిల్‌టన్ కేఫ్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదు.

మహారాజశ్రీ ప్రిన్స్‌పల్ సీనియర్ సివిల్ జడ్జి కొత్తగూడెం వారి కోర్టులో
EP No: 101 of 2022
IN
AACF No. 24 of 2016

Between:
M/s. మార్గదర్శి చిట్‌ఫండ్ ప్రైయివేట్ లిమిటెడ్.,
... డిక్రీహోల్డర్
మరియు
శ్రీ K.L.R. సంతోష్ కుమార్ మరియు ఇతరులు
...జాయింట్ డెటార్స్

JDr No.2
శ్రీ కె. జగదీష్, తండ్రి సుబ్బయ్య, వయస్సు: 66 సం॥లు, R/o. H.No.1-9-1-9-698/124, Flat No. 313, గోల్డెన్ టవర్స్, OU రోడ్, విద్యానగర్, హైదరాబాద్.

ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా డిక్రీ హోల్డర్ తమకు రావలసిన బాకీ రూ. 18,19,838/- (అక్షరాల పద్దెనిమిది లక్షల పంతొమ్మిది వేల ఎనిమిది వందల ముప్పది ఎనిమిది మాత్రమే) రాబట్టుకొను నిమిత్తం పై నెంబరుగల EP దాఖలు చేసినందున సదరు పైన తెలిపిన EPలో మీకు ఆక్షేపణ ఉన్న ఎడల పైన తెలిపిన కోర్టులో Dt.12-02-2024న ఉదయం గం. 10.30 ని॥లకు మీరు స్వయంగా గాని, మీ వకీలు ద్వారా గాని హాజరై తెలియపరచుకొనవలెయును. ల